ప్రజాశక్తి
శనివారం 26, నవంబర్ 2022
5
శ్రీ సత్యసాయి



అర్హులు ఓటరు నమోదు చేసుకోవాలి

పుట్టపర్తి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేయాలని జిల్లా అబ్జర్వర్ డి. మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఓటర్ల జాబితా సవరణ 2023 అంశం పై వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ బసంత్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ భాగ్యరేఖ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సూచనలు సలహాలు తీసుకొని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతామని పరిశీలకులు తెలిపారు.కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, వైసిపి ప్రతినిధి తిప్పన్న, జనసేన బొగ్గరం శ్రీనివాసులు, టిడిపి విజయ్ కుమార్, బిజెపి భాస్కర్ నాయక్, కదిరి ఆర్డీవో రాఘవేంద్ర, ధర్మవరం ఆర్డీవో తిప్పేనాయక్, ఎన్నికల అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి సుస్తీ..!



హిందూపురం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ అసుపత్రి

హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి అనారోగ్యంతో బాధపడుతోంది. శ్రీ సత్యసాయి జిల్లాలో జిల్లా స్థాయి హోదా కల్గిన అసుపత్రి ఇదొక్కటే. ఈ అసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగి ఏడాది కావస్తోంది. ఈ ఆసుపత్రికి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సమావేశం నెల నెలా నిర్వహించి ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏడాదైనా సమావేశం జరగకపోవడంతో అసుపత్రి అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా మారింది. గత మెడికల్ సూపరింటెండెంట్ ఆసుపత్రి అభివృద్ధి సమావేశానికి కలెక్టరును ఆహ్వానించినట్లు సమాచారం. అయితే ఆఫీసు ద్వారా సమావేశానికి సంబంధించిన లెటర్ పంపాలని కలెక్టర్ సూచించినట్లు తెలుస్తోంది. కానీ హిందూపురం జిల్లా అసుపత్రిలో ఈ ఆఫీసు లేకపోవడంతో కలెక్టర్‌కు సమాచారం ఇవ్వడంలేదని సిబ్బంది చెబుతుండడం గమనార్హం.

ఏడాదైనా నిర్వహించని అభివృద్ధి కమిటీ సమావేశం
ఆసుపత్రి వైపు కన్నెత్తి చూడని కలెక్టర్

ప్రజాశక్తి-హిందూపురం

ఆరోగ్య సంజీవనిగా ఉన్న హిందూపురం జిల్లా అసుపత్రిలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ప్రస్తుతం డెంగీ, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సరిపడా పడకలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. సమయపాలనా సరిగా పాటించడం లేదు. అసుపత్రిలో మందుల కొరత షరామామూలే. స్కానింగ్ కోసం ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించి స్థానిక ఎమ్మెల్సీ రూ.5 లక్షలు ఇచ్చారు. వారం రోజుల క్రితం రూ.12.50 లక్షలు వెచ్చించి వైద్యులు సూచించిన మందులను కొనుగోలు చేసి అందించారు. వీటిని సక్రమంగా వినియోగిస్తున్నారా ? లేదా ? అసుపత్రిలో నెలకున్న సమస్యలు ఏంటి ? తదితర వాటిపై ప్రతి నెల అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించాల్సి ఉంది. అయితే సమావేశాలు జరగకపోవడంతో సమస్యలను పరిష్కరించే నాధుడే కరువయ్యారు. కలెక్టర్ స్పందించి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

మాతాశిశు అసుపత్రికి పురిటినొప్పులు..

ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మాతాశిశు అసుపత్రిలో పూర్తిస్థాయి సిబ్బంది లేక పురిటి నొప్పులు పడుతోంది. ఐదుగురు గైనకాలజిస్టులకు గాను కేవలం ఇద్దరే ఉన్నారు. వైద్యులపై పని ఒత్తిడి ఎక్కువవుతోంది. దీంతో కాన్పు కోసం వెళ్తే మరో ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఇక్కడ కాన్పుల సంఖ్య కన్నా రెఫర్‌ల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. జిల్లా ఆస్పత్రిలో గైనకాలజిస్టుల కొరత ఉండడంతో కాన్పుల కోసం వచ్చే గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. కాన్పు కోసం అనంతపురం, లేదా ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి. వెంటనే గైనకాలజిస్టులను నియమించే దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

మరమ్మతులో ఆల్ట్రా, సిటీ స్కాన్ మెషిన్లు..

అసుపత్రిలో సిటీ స్కాన్ యంత్రం మరమ్మతుకు గురయి ఏడాది గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆస్పత్రిని సందర్శించే ప్రజాప్రతినిదులు వెంటనే నూతన సిటీ స్కాన్ యంత్రం తెప్పిస్తామని చెబుతున్నారు. అయితే యంత్రం మాత్రం రావడం లేదు. కడుపు నొప్పికి తీయాల్సిన అల్ట్రా సౌండ్ స్కాన్ మిషన్ అందుబాటు ఉన్నప్పటికీ సంబందిత వైద్య నిపుణులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. అసుపత్రికి వచ్చే రోగులు రూ.వేలు ఖర్చుచేసి బయట స్కానింగ్ చేయించుకోవాల్సిన పరిస్థితి.

సమయపాలన ఏదీ..?

రోగులకు సేవలు అందించడంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వైద్యులే కీలకం. కొంత మంది డ్యూటీలు ఎగ్గొట్టి ప్రయివేటు సేవల్లో మునిగిపోతున్నారు. క్యాజువాల్టీ వంటి అత్యవసర సేవలకు డ్యూటీలో ఉన్న డాక్టర్లు డుమ్మా కొడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలో తప్పక ఉండాలి. కానీ ఉదయం 9, 10 గంటలకు బయోమెట్రిక్ వేసి మధ్యాహ్నం 12 గంటలకే సొంత క్లినిక్‌లు, బయటి ఆసుపత్రులకు వెళ్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.


మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

స్త్రీ హింస నిర్మూలనకు పాటుపడదాం

కలెక్టర్ బసంత కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

స్త్రీ హింస నిర్మూలనకు పాటుపడదామని కలెక్టరు బసంత్ కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పిలుపునిచ్చారు. స్త్రీలపై హింస వ్యతిరేక దినోత్సవంలో భాగంగా పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ స్త్రీలపై జరిగే హింస వ్యతిరేక పక్షోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ బసంత కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, ఐసిడిఎస్ పీడీ సహాయ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ మాట్లాడుతూ స్త్రీలపై జరుగు హింసకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు, స్త్రీలపై హింసకు పాల్పడుతున్న వారి పట్ల నమోదుతున్న సెక్షన్లు, వారికి విధిస్తున్నటు శిక్షలు మొదలైన వాటి గురించి తెలియజేశారు. నేటికీ దేశంలో చాలామంది స్త్రీలకు గృహహింస చట్టంపై సరైన అవగాహన లేదన్నారు. ప్రభుత్వం వారికి ఇవ్వబడిన హక్కులు, చట్టాల గురించి పూర్తి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ చట్టాల ద్వారా భౌతిక హింసలు, దాడుల నుంచి రక్షణ పొందచ్చని చెప్పారు. దేశంలో 29 శాతం స్త్రీలు నేటికీ గృహహింసకు గురవుతున్నట్టు ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తెలియజేస్తోందన్నారు. 18 సంవత్సరాల నుండి 34 సంవత్సరాల లోపు ఉన్న స్త్రీలే ఎక్కువగా గృహహింసకు, భౌతిక దాడులకు గురవుతున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక తెలుపుతోందన్నారు. ప్రతి స్త్రీ వారి రక్షణ కోసం చేయబడిన చట్టాల గురించి తెలుసుకున్న రోజే ఈ హింస నుండి విముక్తి పొందగలరని తెలిపారు. ఏ స్థాయిలోనైనా పోలీసు వారి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఎవరైనా ఇలాంటి హింసకు బాధితులుగా ఉన్నట్లయితే నిర్భయంగా పోలీసులను ఆశ్రయించవచ్చని, తద్వారా వారికి రక్షణ కల్పించబడుతుందని చెప్పారు. హింసకు, దాడులకు పాల్పడిన వారిని చట్టం ద్వారా శిక్షిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, ఎంపీడీవో అశోక్‌కుమార్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు, గాయత్రి. సిడిపిఒలు శాంతలక్ష్మి, వరలక్ష్మి, కవిత, రాధిక, సూపర్‌వైజర్ సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ఉడికీ ఉడకని అన్నం తిని
25 మంది విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉడికీ ఉడకని అన్నం తిని కదిరి పట్టణంలోని వీవర్స్ కాలనీ ఉన్న మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌కు చెందిన 25 మంది విద్యార్థులు గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 146 మంది విద్యార్థులు ఉన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు లావణ్య హుటాహుటిన చికిత్స నిమిత్తం విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరాల మేరకు.. విద్యార్థులకు మధ్యాహ్నం మాడిపోయిన, వాసన వస్తున్న భోజనం పెట్టారు. విద్యార్థులు అన్నం తినకుండా వదిలేశారు. గమనించిన ప్రధానోపాధ్యాయురాలు లావణ్య మళ్లీ మంచి భోజనం తయారుచేసి పిల్లలకు వడ్డించాలని మధ్యాహ్న భోజనం సిబ్బందికి సూచించారు. వారు ఆత్రంగా ఉడికీ ఉడకని అన్నం తయారుచేసి పిల్లలకు వడ్డించారు. ఆ భోజనం తిన్న విద్యార్థులు అరగంట తరువాత కడుపునొప్పి, కళ్ళు తిరుగుతున్నాయంటూ వాంతి చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

విద్యార్థి సంఘాల నాయకుల పరామర్శ

విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఆర్ఎస్‌వైఎస్ విద్యార్థి సంఘాల నాయకులు ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్, విజయ్ కుమార్ మాట్లాడుతూ..అధికారులు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం ఓబుళదేవురచెరువు మండలం మిట్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఇప్పుడు మళ్లీ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ సంఘటనకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాబావలి, ఆర్ఎస్‌వైఎఫ్ అరుణ్‌కుమార్, భార్గవ్, కిషోర్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంఇఒ చిన్నకృష్ణ చెప్పారు. ఆస్పత్రికి వెళ్లి ఆయన విద్యార్థులను పరామర్శించారు. డిఎంహెచ్ఒ ఎస్.వి.కృష్ణారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఉడికీ ఉడకని అన్నం తినడం వల్లే పిల్లలకు కడుపునొప్పి, వాంతులు అయ్యాయని తెలిపారు.


మండల సర్వసభ్య సమావేశంలో సెల్‌ఫోన్‌లో పేకాట ఆడుతున్న ఉద్యోగి

సారూ.. ఇదేం తీరు...

మండలమీట్‌లో తాపీగా మొబైల్ పేకాట ఆడుతున్న ఉద్యోగి
ఇదీ ప్రజాసమస్యలపై ఆ అధికారికి ఉన్న శ్రద్ధ

ప్రజాశక్తి - పరిగి

ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలకు వేదికగా నిలచిన మండల సర్వసభ్యసమావేశంలో ఓ అధికారి అనుసరించిన తీరు విస్మయం కలిగిస్తోంది. ప్రజాసమస్యలపై సభ్యులు, అధికారులు సీరియస్‌గా చర్చిస్తున్న నేపథ్యంలో ఆ సమావేశంలో తన శాఖ తరపున పాల్గొన్న ఓ అధికారి ఏకంగా సెల్‌ఫోన్‌లో పేకాట గేమ్ ఆడుతూ కాలక్షేపం చేశాడు. ఈ సంఘటన పరిగి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో 'ప్రజాశక్తి' కంటపడింది. ఈ ఘటనకు సంబందించిన వివరాలు... పరిగి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి సవిత ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్టీసీ శాఖ తరపున హిందూపురం ఆర్టీసీ డిపో ఎడిసి అధికారి ఓంకార్ మూర్తి హాజరయ్యారు. సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు, అదికారుల మధ్య చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యలతో తనకేం పని అనుకున్నాడేమో ఆ ఆర్టీసీ అధికారి ఓంకార మూర్తి. ఏదో టైంపాస్‌కు వచ్చినట్లు తన సెల్‌ఫోన్ తీసి అందులో పేకాట గేమ్ అడే పనిలో నిమగ్నమయ్యాడు. మండలంలో పలు గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక సమస్యగా మారిన మండలంలో తన శాఖ తరపున సమావేశంలో మాట్లాడాల్సిన ఆ అధికారి ఏదో విహారయాత్రకు వచ్చినట్లు సమావేశానికి వచ్చి మొబైల్‌లో పేకాట గేమ్ ఆడుతూ గడపడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈయన తీరు చూస్తుంటే ప్రజాసమస్యలపై ఆయనకున్న చిత్తశుద్ధి ఏపాటిదో ఇట్టే అర్థం అవుతోంది. ఇదిలా ఉండగా మొబైల్‌లో పేకాట గేమ్ ఆడుతున్న దృశ్యాన్ని విలేకరి ఫొటో తీశాడని ఇతర ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళితే 'ఇలాంటివి చాలా జరుగుతుంటాయి.. ఏం కాదులే..' అని నిర్లక్ష్యంగా మాట్లాడంపై ఇతర శాఖల ఉద్యోగులు ఆశ్చర్యానికి లోనయ్యారు. మండల సర్వసభ్యసమావేశంలో ఆర్టీసీ ఉద్యోగి మొబైల్‌లో పేకాట ఆడుతున్న విషయాన్ని ఎంపీడీవో సరస్వతి దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేస్తామని నిజమని తెలితే సంబంధిత ఉన్నత అధికారికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

జిల్లా స్థాయి తరహాలో వైద్య సేవలు

పజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా అసుపత్రి స్థాయిలో సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘం పరిధిలో 19వ వార్డు ఇందిరా నగర్‌లో రూ.80లక్షలతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎం డిపిఎంఒ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా 18 పట్టణ ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో ఇప్పటికే 5 భవనాలు ఉన్నాయని, మిగిలిన 13 భవనాలను నూతనంగా నిర్మాణం చేసి ప్రారంభిస్తున్నామన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారన్నారు. అత్యవసర సేవలు సైతం ఆరోగ్య కేంద్రంలో చూస్తారన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతు అన్ని అసుపత్రుల్లో అవసరమైన అన్ని ప్రాథమిక సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, వైద్యులు ఆనంద్‌కుమార్, సాయి సుప్రిత, కౌన్సిలర్లు జయప్ప, మల్లికార్జున, రహమత్‌బి, మణి, నాగేంద్ర బాబు, రోషన్, గిరీష్, వెంకటేష్‌రెడ్డి, బాబు, కో-ఆప్షన్ మెంబర్ రహమత్, నాయకులు లతీఫ్ సేఠ్, సోమశేఖర్ రెడ్డి, ధనుంజయరెడ్డి,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు సమస్యను వివరిస్తున్న బాధితుడు

నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం : ఆర్డీవో

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని కదిరిగేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారందరికీ న్యాయం చేస్తామని ఆర్డీవో తిప్పేనాయక్ హామీ ఇచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశపు భవనంలో నిర్వాసితులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ సేకరణ చట్టం ప్రకారం కట్టడాలకు సంబంధించి నష్టపరిహారం లబ్దిదారుల ఖాతాలోకి జమచేయడం జరిగిందన్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే వాటికి సంబంధించిన అధికారులచేత తిరిగి విచారణ చేయిస్తామనిఅందుకు సంబంధించి అర్జీలు ఇవ్వాలని ఆర్డీవో కోరారు. ఈ కార్యక్రమంలో డిఎఒ కతిన్‌కుప్రా, తహశీల్దార్ నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలి :. ఎన్నో ఏళ్లగా ఇక్కడే నివాసముంటు లక్షలు ఖర్చు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం తమ ఇళ్లను తొలగిస్తామనడం ఎంతవరకు సమంజసమని బాధితులు అధికారులను ప్రశ్నించారు. పట్టణంలో ఎక్కడైనా పునరావాసం కల్పించి, నష్టపరిహారం చెల్లించిన తరువాతనే తమ ఇళ్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

గణాంకాలు.. గ్రాఫిక్స్‌లోనే 'బాబు' అభివృద్ధి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-హిందూపురం

చంద్రబాబు అభివృద్ధి గణాంకాలు, గ్రాఫిక్స్‌లో మాత్రమే ఉంటాయని స్థానిక ఎమ్మెల్సీ ఇక్బాల్ ఎద్దేవా చేశారు. శుక్రవారం హిందూపురం పురపాలక సంఘ పరదిలో 22వ వార్డు నింకంపల్లిలో నాడు-నేడు పథకం కింద రూ.16లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం 13వ వార్డు ఆటోనగర్‌లో రూ.97.50లక్షలతో చేపట్టిన మురుగు కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతు దేశంలోనే ఎక్కడా అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. టిడిపి హయాంలో బాలయ్య హిందూపురం పట్టణంతో పాటు నియోజక వర్గాన్ని ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. బావ రాష్ట్రాన్ని, బామ్మర్ది హిందూపురం పురపాలక సంఘాన్ని లూటీ చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు జయప్ప, మల్లికార్జున, రహమత్‌బి, మణి, నాగేంద్ర బాబు, రోషన్, గిరీష్, వెంకటేష్‌రెడ్డి, బాబు, కో-ఆప్షన్ మెంబర్ రహమత్, నాయకులు లతీఫ్ సేఠ్, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో రోడ్డుకు అడ్డంగా పడుకున్న సిపిఎం నాయకుడు)



రోడ్డు ప్రమాద దృశ్యం

అధికారుల నిర్లక్ష్యానికి మరొకరు బలి
ప్రమాదస్థితిని ముందే హెచ్చరించినా పట్టించుకోని అధికారులు
పాలకులు, అధికారుల తీరుపై ఆగ్రహం
రోడ్డుపై బైటాయించిన సిపిఎం నాయకులు, స్థానికులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని కోడూరు మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో కుమారుడు మృతిచెందగా తల్లి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. హిందూపురం మోడల్ కాలనీకి చెందిన నాగజ్యోతి, ఆమె కుమారుడు సాయి చరణ్ హిందూపురం నుండి గోరంట్ల వైపు స్కూటీలో వెళుతున్నారు.కోడూరు మలుపు వద్ద దాటుతుండగా అది గమనించని లారీ అతి వేగంతో ద్విచక్ర వాహనంపై దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో సాయి చరణ్(23) అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లి నాగజ్యోతి తీవ్రగాయాల పాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ప్రమాద దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే స్పీడ్ బ్రేకర్లు వేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్ మృతుని కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో దాదాపు గంట సేపు అందోళన చేపట్టారు. దీంతో ఇటు కొడికొండ చెక్‌పోస్టు, అటు పాల సముద్రం వరకు దాదాపు 5 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సిఐ వెంకటేశ్వర్లు సంఘటనస్థలానికి చేరుకుని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవటంతో ఎట్టకేలకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సిగ్నల్ లైట్లు, బారికేట్లు ఏర్పాటు చేయిస్తామని హిందూపురం సిఐ హామీ ఇచ్చారు. అయితే శాశ్వత పరిష్కారం కోసం ఫ్లైఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసే వరకు తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, రామచంద్ర,వెంకటేష్ లక్ష్మినారాయణ తదితరులు హెచ్చరించారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు వాహనాల రాకపోకలకు అడ్డగా రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై ఉదయం ఆందోళన.. మధ్యాహ్నం ప్రమాదం...

కోడూరు వద్ద నవీకరణ పేరుతో స్పీడ్ బ్రేకర్లు, బారికేట్లను తొలగించడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కోడూరు పంచాయతీ అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు శుక్రవారం ఉదయం ఆందోళన చేపట్టారు. స్పీడ్‌బ్రేకర్లు వెంటనే వేయాలని లేకుంటే ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. వేస్తామని హామీ ఇచ్చిన అధికారులు, గుత్తేదారులు ఓ వైపు వేసి మరో వైపు వేయకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో స్పీడ్ బ్రేకర్ వేయని రోడ్డుపై శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదం జరిగి ఒకరు మృతిచెందారు.

ప్రమాదాలాకు కేరాఫ్ : కోడూరు వద్ద ఉన్నది భయానక మలుపు, ప్రమాదాలకు నిలయం. ఇక్కడ అనేక ప్రమాదాలు జరిగాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది శాశ్వత వికలాంగులుగా మిగిలిపోయారు. అనేక కుటుంబాలు అనాథ కుటుంబాలుగా మిగిలిపోయాయి. కొత్తగా పెళ్లి చేసుకున్న జంట నుండి పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల వరకు అనేక మంది ప్రాణాలు పోయాయి. అయిన జాతీయ రహదారి అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు కనికరం కలగలేదు. అనేక సార్లు కోడూరు కూడలి వద్ద జాతీయ రహదారిపై ప్లై ఓవర్ బ్రిడ్జ్ వేయాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళన చేశారు. స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుతో సరిపెట్టారు కాని ప్లేఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు మరమ్మతుల పేరుతో వాటిని తొలిగించారు. దీంతో ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయింది. శుక్రవారం మధ్యాహ్నం మరో ప్రాణం అందరూ చూస్తుండగానే పోయింది.ఇంకో మహిళ కాలు. నడుము విరిగి కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంది.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి : చిలమత్తూరు మండలం 44 వ జాతీయ రహదారి కోడూరు తోపు వద్ద అధ్యాత్మిక కేంద్రాలకు నిలయమైన పుట్టపర్తి ,కదిరి, ప్రాంతాలకు వెళ్లే మలుపు ఉంది. జిల్లాకేంద్రమైన పుట్టపర్తికి అనేక మంది విఐపిలతో పాటు ప్రపంచ పర్యాటకులు వెళుతుంటారు. ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. హైవే నిర్మణ ఇంజనీర్ల వైఫల్యమో, కాంట్రాక్టర్ల కాసుల కక్కుర్తో, హైవే అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కాని అవసరమున్న చోట బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీని కారణంగా చుట్టు పక్కల గ్రామాలలో కనీసం గ్రామానికి ఇద్దరు ముగ్గురు చొప్పున ఆ మలుపు వద్ద ప్రాణాలు కోల్పోయిన,కాళ్లు చేతులు పోగొట్టుకున్న వారు ఉన్నారు. అనేక మంది స్థానికేతరులు ప్రయాణదారులు ప్రాణాలు కోల్పోయారు. అయినా నేషనల్ హైవే అధికారులు పట్టించుకోవటం లేదు. ఇక హామీలు గుప్పించి ఎన్నికల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఆలోచన కూడా చేయడం లేదు. దీంతో ప్రజలు బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

రొద్దం : మండల కేంద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకుడు ప్యారిజాన్ (85) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి తన వంతు సాయంగా రూ.5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ, మురళి, ఉగ్గిరప్ప, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై 'మున్సిపల్' దాడులు

కదిరి టౌన్ : పట్టణంలోని పలు దుకాణాలపై మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించారు. పురపాలక సంఘం చైర్ పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు 4 రోజులుగా కదిరి లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిర్మూలనకు దాడులు నిర్వహిస్తున్నారు. కాలేజ్ రోడ్, మునిసిపల్ ఆఫీస్ రోడ్, ఇందిరాగాంధీ సర్కిల్, బస్టాండ్ ఏరియా లో గల పండ్ల వ్యాపారులు, పూల వ్యాపారులు, జనరల్ స్టోర్, హోల్‌సేల్ షాపులు, సూపర్ మార్కెట్లతో సహా పలు దుకాణాలలో దాడులు నిర్వహించారు. సుమారు 50 కేజీ ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను శానిటరీ ఇన్స్‌పెక్టర్ సి వి రమణ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు పర్యావరణ , పారిశుధ్య కార్యదర్శులు కుసుమలత, లావణ్య రెడ్డిశేఖర్, పవన్, మధుసూదన రెడ్డి, చంద్రశేఖర్ నాయక్, రమేష్ నాయక్ మోహన్ రెడ్డి, ఆంజనేయులు, వినోద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ఓబుల దేవర చెరువు: మండల పరిధిలోని కొండకమర్ల వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు మాట్లాడుతూ వసతి గృహంలోని 81మంది విద్యార్థులకు ఎబిసిడబ్ల్యూఒ గంగాద్రి చేతుల మీదుగా దుప్పట్లు కార్పెట్లు పంపిణీ చేశామన్నారు.

ఆర్‌బికె సిబ్బంది పనితీరు మారాలి

పుట్టపర్తి రూరల్ : రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పనితీరు మారాలని శ్రీ సత్యసాయి జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ సాగునీటి పథకం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌బికెల సిబ్బందికి అవగాహన సదస్సును స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవుటాల రమణారెడ్డితో పాటు పుట్టపర్తి ఎంపిపి ఎవి..రమణారెడ్డి డిఎంఐఒ సుదర్శన్, ఎంఐఎఒ చెన్నకేశవులు, డిహెచ్ఒ చంద్రశేఖర్, హెచ్ఒ రాంప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 32 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ఇప్పటికే 28 రైతు భరోసా కేంద్రాలను తనిఖీలు చేశామని, సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చామని చెప్పారు. సిబ్బంది పనితీరు మెరుగవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోలు వెంకట బ్రహ్మం, నటరాజ్, సుమతి, ఏఈవోలు ఆనంద్ నాలుగు మండలాల ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత సమావేశాన్ని జయప్రదం చేయండి

బత్తలపల్లి : ఈ నెల 27న పుట్టపర్తిలో నిర్వహించే కురుబల ఐక్యతా సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు కోరారు. ఈ మేరకు ఆయన ఐక్యతా సమావేశం పోస్టర్లను పోట్లమర్రి గ్రామంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు కోటి నరేష్, కోటి సురేష్, కోటి గోపీనాథ్, పెదయ్య, వీరనారప్ప, సోమశేఖర్, బండి వీరనారప్ప, కప్పల సుదర్శన్, కమతం ఈశ్వరయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : ఈ నెల 27న పుట్టపర్తిలో నిర్వహించే కురుబల ఐక్యతా సమావేశాన్ని జయప్రదం చేయాలని కురుబ సంఘం నాయకులు కోరారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి కురువ సోదరులు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, టిడిపికి చెందిన మాజీ ఎంపీటీసీ అశ్వర్థ, నాయకులు కాటమయ్య, వీరానంద, కొంక నాగార్జున, సర్పంచి వెంకట వరద తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ఈనెల 27న పుట్టపర్తి లో జరిగే కురవల ఐక్యతా సభను విజయవంతం చేయాలని ఆసంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలను పర్యటిస్తూ సమావేశాన్ని జయప్రదం చేయడానికి కురుబలను చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని కనిశెట్టిపల్లి, లింగారెడ్డిపల్లి, తలమర్ల, మరుకుంట్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివానంద, కేశినేని ఆదినారాయణ, చెన్నప్ప, తిప్పయ్య స్వామి, రామకృష్ణ, ప్రభాకర్, నారాయణస్వామి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

సిఐపై చర్యలకు డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

పుట్టపర్తి రూరల్ : దళిత యువత పైన అత్యాచారం చేసిన నిందితులను అరెస్టు చేయమని శాంతియుతంగా గుంటూరు కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులపై దాడి చేసిన సిఐపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఇఎఫ్, ఎఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పుట్టపర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ నాయకుడపై దాడికి పాల్పడిన సిఐ హేమంత్ బాబును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు పైపల్లి నరసింహులు, పెదపల్లి రంగప్ప, కేశపురం వెంకట రాముడు, నిడిమామిడి సూరి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోండి

హిందూపురం : విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు అడుగేయాలని ఎస్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక కళాశాల ప్రాంగణంలో ద్వితీయ, తతీయ సంవత్సరం విద్యార్థినులు ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమలమ్మ, వెంకటేశులు, శ్రీధర్, యశోదరాణి, యశోదా దేవి, భోజప్ప, రవి నాయక్, సుమంగళి, సరస్వతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యం

హిందూపురం : విద్యార్థులు పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యమనిసప్తగిరి కళాశాల ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సప్తగిరి ఎంబిఎ కళాశాలలో ఓరియంటేషన్ డే-2022ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి మాట్లాడుతు విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదల, సమయపాలనతో పాటు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు అలవర్చుకున్నట్లయితే అపార ఉద్యోగ అవకాశాలు అభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

రొద్దం : ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని రొద్దం2, 3 సచివాలయాలను తనిఖీ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌బికె, సచివాలయ భవనాలను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈసందర్భంగా కంచంద్రం గ్రామానికి చెందిన దళిత రైతు మద్దిలేటి తన భూమి సమస్యను కలెక్టర్‌కు వివరించారు. సాగులో తాను ఉన్నా మరొకరికి ఆన్‌లైన్‌లో ఎక్కించారనితన వద్దఉన్న పత్రాలు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంతచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

ఓబుల దేవర చెరువు : మండలంఓని వెంకటాపురం గ్రామంలో అర్హులైన రైతులకు 300 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీ చేసినట్లు ఎఒ ఇలియాస్ అహ్మద్ తెలిపారు. అర్హులైన రైతులందరికీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అగ్రి అడ్వైజర్ బోర్డు చైర్మన్ కే లక్ష్మీపతి రెడ్డి, వెంకటాపురం అగ్రి అడ్వైజర్ బోర్డ్ చైర్మన్ కే చెన్న రెడ్డితో పాటు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సుందరయ్యనగర్ పాఠశాలలో 8వతరగతి చదువుతున్న విద్యార్థి విజయ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణరెడ్డి, పిఈటి వీర తెలిపారు. బుక్కరాయసముద్రంలో రెండు రోజుల క్రితం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-17 బాస్కెట్‌బాల్ విభాగంలో విద్యార్థి విజయ్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. దీంతో ఆ విద్యార్థిని హెచ్‌ఎం, పిఇటితో పాలు ఉపాధ్యాయులు అభినందించారు.

30 నుంచి ప్రత్యేక పూజలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30వ నుంచి డిసెంబర్ 4 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆసంఘం నాయకులు తెలిపారు. శ్రీకార్యసిద్ధివినాయక, కాశీవిశ్వేశ్వర, అభయ ఆంజనేయస్వామి నవగ్రహవిగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. స్థానిక మార్కెండేయస్వామి దేవాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో పద్మశాలీయ బహత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్నశింగరయ్య ఉపాధ్యక్షులు జింకా రామాంజనేయులు, ప్రధానకార్యదర్శి జింకా చిన్నప్ప, సహాయ కార్యదర్శి బోడగల శంకర్, కోశాధికారి పారాళ్లపుల్లయ్య మాట్లాడారు. తేదీల వారిగా జరిగే పూజల గురించి వారు వివరించారు. ఈ సమావేశంలో ఆ సంఘం కార్యనిర్వాహక సభ్యులు. ప్రచార కార్యదర్శులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కాగృహాలు

బుక్కపట్నం : అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కాగృహాన్ని మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని హౌసింగ్ పీడీ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేసి, బిల్లుల చెల్లింపులో జాప్యం కాకుండా చూడాలన్నారు. డిసెంబర్ 15వ తేదీ లోపల ఇంటి పునాదులు పూర్తి అయ్యేలా అధికారుల చర్యలు చేపట్టాలని అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, తహశీల్దార్ నటరాజ్, ఎంపీడీవో శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ చైర్మన్ వెంకట చౌదరి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా

మడకశిర : ఎన్నికల విభాగం శుక్రవారం విడుదల చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా తప్పుల తడకగా మారింది. ఈ తప్పిదాలను సరిచేసి అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించాలని ఓటర్లు కోరుతున్నారు. ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న పేర్లు పూర్తిస్థాయిలో లేవని సగం పేర్లు మాత్రమే నమోదు చేశారని వాపోతున్నారు. మరికొందరివి చిరునామా సరిగ్గా లేవన్నారు. వాటిని సరి చేసి తిరిగి ఓటర్ల జాబితాను ప్రకటించాలని ఓటర్లు కోరుతున్నారు

ఉపాధ్యాయులకు శిక్షణ

లేపాక్షి : స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో లేపాక్షి, చిలమత్తూరు, హిందూపురం మండలాల్లోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6,7, 8 తరగతులు బోధించే ఉపాధ్యాయులందరికీ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ పోగ్రాం కింద శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, రాష్ట్ర పర్యవేక్షకులు మాట్లాడుతూ బోధనాపద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు నాయక్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మురళీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తాడిమర్రి : మండలంలోని మరిమేకలపల్లిలో ఉపాధి పనులను పీడీ రామాంజనేయులు శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ ద్వారా రైతులు సాగు చేసిన చీనీచెట్లను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఏపీవో సంజీవరెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ అశోక్ కుమార్ రెడ్డి, హరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు

సిఐ సురేష్‌బాబుకు సన్మానం

మడకశిర రూరల్ : సిఐ సురేష్ బాబును ఎంఆర్‌పిఎస్ నాయకులు శుక్రవారం సన్మానించారు. దళితులపై జరుగుతున్న దాడులు, వివక్షతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈసందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు, శంకర, శివన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గోరంట్ల : మండలంలోని పులేరు గ్రామంలో శుక్రవారం అల్ట్రా విజన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు ఈ వైద్య శిబిరాన్ని సర్పంచి ప్రభాకర్ రావు ప్రారంభించారు గ్రామ సచివాలయంలో కంటి పరీక్షలు నిర్వహించారు. అపరేషన్లు అవసరమున్న వారికి వారికి పుట్టపర్తి లో గల అల్ట్రా విజన్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర, సచివాలయ ఉద్యోగులు, ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు గడువు పొడిగింపు

అమడగూరు : రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను డిసెంబర్ 9 వరకు పొడిగించినట్లు తహశీల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో మండలం వ్యాప్తంగా 506 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం ఓటరునమోదకు గడువు పొడిగించారని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం





సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ

గుడిబండ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళికెర గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లగా ఆ సమస్యల్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ జయరాములు. ఎడిసిసి బ్యాంక్ డైరెక్టర్ కారుణ్య రాజశేఖర్, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, వైస్ ఎంపీపీ రత్నమ్మ శివన్న, సర్పంచి రంగస్వామి, ఎంపీడీవో రామారావు, తహశీల్దార్ మహబూబ్‌పీరాతో పాటు ఆయా శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : గడపగడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని పెనుగొండ శాసనసభ్యులు శంకర్ నారాయణ తెలిపారు. పట్టణంలో మూడో వార్డులో శుక్రవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయ రెడ్డి, జెడ్పీటీసీ జడ్పిటిసి జయరాం నాయక్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, ఎంపీపీ ప్రమీల మూర్తి, సర్పంచులు సరోజ నాగే నాయక్, రామాంజనేయులుతో పాటు ఆయాశాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పోరేషన్ చైర్మన్ సూర్యప్రకాష్ బాబు, ఎంపీపీ గుర్రం వనజ, కోటి సుధ, సర్పంచు దామోదర్, కోటి నరేష్ కుమార్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారుఈసందర్భంగా గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంపీపీ గుర్రం వనజ, జెడ్పీటీసీ కోటి సుధ చేతులమీదుగా ప్రారంభించారు.



పార్టీలోకి చేరిన వారితో చిలకం మధుసూదన్ రెడ్డి

పార్టీ బలోపేతానికి కృషిచేయండి : చిలకం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. పట్టణంలోని 32వ వార్డు దుర్గానగర్‌కు చెందిన 10 కుటుంబాలకు చెందిన షేక్షాహీద్, దేవిపురం రామాంజి, సాదేచంద్ర, కంపల శేషు, కువల ప్రవీణ్, మల్లెల వెంకటేశ్, వేల్పమడుగు సూర్యానారాయణరెడ్డి తదితరులు జనసేనలోకి చేరారు. ఈసందర్భంగా చిలకం మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిలకం మాట్లాడుతూ జనసేనపార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడానికి అందరు కలిసికట్టుగా కషిచేయాలన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రం అధోగతి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి మడకశిర రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడున్నర సంవత్సరాల తన పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఈరన్న విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈరన్న మాట్లాడుతూ లోకేష్ చేపడుతున్న భరోసా పాదయాత్రను వైసీపీ అవినీత పాలన అంతం చేసేందుకు వేసే తొలి అడుగుగా అభివర్ణించారు. ఈసందర్భంగా పాదయాత్ర పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వక్కలిగ సాధికార కమిటీ కన్వీనర్ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవి భూషణ్, రైతు విభాగపు జిల్లా అధ్యక్షులు ఉగ్ర నరసింహప్ప, మాజీ ఎంపీపీ అశ్వర్థరామప్ప, ఆదినారాయణ, గౌడన్నహల్లి కిష్టప్ప, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



లేపాక్షిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ



బత్తలపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీటీ ప్రతినిధి

పరిగి : సమాజంలో మార్పు రావాలంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీటీ డైరక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలం లోని సేవామందిర్ ఆర్‌డిటి భవనంలో శుక్రవారం అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలనదినోత్సవాన్ని ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిటి వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో పాటు మహిళా సంఘాల సభ్యులు ప్లే కార్డుల చేతబట్టి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో తిప్పేస్వామి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ నారాయణస్వామి, రామకృష్ణ, గోరవనహళ్లి నారాయణ, బీచిగానిపల్లి ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : ఆర్‌డిటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్ములన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు సమావేశంలో సిఐ వేణుగోపాల్, ఎడి రవి ప్రకాష్ తదితరులు మాట్లాడారు.

తలుపుల : అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ వాలంటీర్లు, మహిళా పోలీసులతో పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డి అధ్యక్షతన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టోపీ రమణ, ఉప సర్పంచ్ చింతకుంట కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ఆర్డీడీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం స్త్రీ హింస నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పెనుకొండ డీఎస్పీ హుస్సేన్ పీరా, స్థానిక ఎస్ఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ లలిత, ఆర్డీటీ నాగభూషణ, మహిళలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలకేంద్రంలో అంతర్జాతీయ స్త్రీహింస నిర్మూలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సోషియల్ కమిటీ సభ్యులు ప్రభుకుమారి, రాధమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్డీటీ ప్రతినిధి శ్రీదేవి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శ్రీధర్, ఎటిఎల్ రుక్మాంగద, ఎస్టీఎల్ యల్లమ్మ, శారద హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీహింస నిర్మూలను ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు, మహిళా సంఘాల సభ్యులతో పాటు ఆర్డీటి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.